विधायी II अनुभाग
राजभाषा खण्ड
डा. सं.........
तारीख.........

रजिस्ट्री सं डि/२२१
Registered No. D. 221
రిజిస్ట్రీ నంఖ్య డి. 221

Price Rs. 5-00 Paise.
మూల్యము రు. 5.00 పైసలు.

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग : XVI अनुभाग : 1
**Part XVI Section 1.**
భాగము XVI అనుభాగము I

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారముద్వారా ప్రచురింపబడినది

| | | | |
|---|---|---|---|
| सं. २ | नई दिल्ली | सोमवार | १८ दिसंबर १९८९/२७ अग्रहायन १९११ शक खंड. ४ |
| No. 2 | New Delhi | Monday | 18th December 1989/27 Agrahayan 1911 Saka Vol. 4 |
| నంఖ్య 2 | న్యూఢిల్లీ | సోమవారము | 18వ డిశంబరు 1989/27వ అగ్రహాయన 1911 శక నంపుటము 4 |

## MINISTRY OF LAW AND JUSTICE

**( Legislative Department )**

New Delhi, 3rd June, 1989/13 Jyeshtha 1911 Saka

The translations in Telugu of (1) The Hindu Marriage Act, 1955 (Act 25 of 1955) (2) The Probation of Offenders Act, 1958 (Act 20 of 1958) and (3) The Indian Divorce Act, 1869 (Act 4 of 1869), are hereby published under the authority of the President and shall be deemed to be the authoritative texts thereof in Telugu under clause (a) of section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (50 of 1973).

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

(శాసన నిర్మాణ విభాగము)

న్యూఢిల్లీ, 3 జూన్, 1989/13 జ్యేష్ఠ 1911 శక.

(1) ది హిందూ మ్యారేజీ యాక్టు, 1955 (1955 లోని 25వ చట్టము) (2) ది ప్రొబేషన్ అఫ్ అఫెండర్స్ యాక్టు, 1958 (1958 లోని 20వ చట్టము) మరియు (3) ది ఇండియన్ డైవర్సు యాక్టు, 1869 (1869 లోని 4వ చట్టము), ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములు ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# హిందూ వివాహ చట్టము 1955
# (1955 లోని 25వ చట్టము)

[18 మే, 1955]

హిందువులలో వివాహ సంబంధ శాసనమును సవరించి క్రోడీకరించుటకైన చట్టము.

భారత గణరాజ్యము యొక్క ఆరవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగ శాసనము చేయబడినది :—

## ప్రారంభిక

1. (1) ఈ చట్టమును హిందూ వివాహ చట్టము, 1955 అని పేర్కొనవచ్చును. సంగ్రహ నామము, విస్తరణము.

(2) ఇది జమ్మూ-కాశ్మీరు రాజ్యము మినహా, యావద్భారత దేశమునకు విస్తరించును; మరియు ఈ చట్టము విస్తరించు రాజ్యక్షేత్రములలో అధివాసముగల హిందువులకు, వారునదరు రాజ్యక్షేత్రముల వెలుపలనున్నను, వర్తించును.

2. (1) ఈ చట్టము ఈ క్రింది వారికి వర్తించును :— చట్టముయొక్క వర్తింపు.

(ఏ) వీరశైవుడు, లింగాయతుడు, లేక బ్రహ్మసమాజము, ప్రార్థన సమాజము లేదా ఆర్యసమాజము యొక్క అనుయాయితోసహా, హిందూమతస్థుడై ఆ మతము యొక్క ఏదేని రూపమునకు, లేదా వికాసదశకు చెందియున్న ఎవరేనివ్యక్తి;

(బీ) బౌద్ధ, జైన లేక సిక్కు మతమునకు చెందిన ఎవరేని వ్యక్తి; మరియు,

(సీ) ఈ చట్టమును చేయకుండినచో, దీనిలో ఉల్లేఖింపబడిన ఏవేని విషయములలో హిందూ శాసనముగాని, ఆ శాసనములో భాగమగు ఏదేని ఆచారము, లేక వాడుకగాని, అతనికి వర్తించి యుండదని రుజువైననేతప్ప, ఈ చట్టము, విస్తరించు రాజ్యక్షేత్రములలో అధివాసము కలిగియుండి, మతరీత్యా ముస్లిము క్రైస్తవుడు, పార్శీ, లేక యూదుడుకానట్టి ఎవరేని వ్యక్తి.

విశదీకరణము:— ఈ క్రింది వ్యక్తులు సందర్భానుసారముగ, హిందూ, బౌద్ధ, జైన లేక సిక్కు మతమునకు చెందినవారు :—

(ఏ) హిందూ, బౌద్ధ, జైన లేక సిక్కు మతమునకు చెందిన తల్లిదండ్రుల ఔరసుడైన లేక అనౌరసుడైన బిడ్డ ఎవరైనను;

(బీ) తలిదండ్రులలో ఒకరు హిందూ, బౌద్ధ, జైన లేక సిక్కు మతమునకు చెందినవారైయుండి, అట్టి తల్లి, లేక తండ్రి చెందియున్న లేక చెందియుండిన జనజాతి, సమాజము, సముదాయము, లేక కుటుంబము యొక్క సభ్యుడుగ పెంచబడినట్టి, ఔరసుడైన లేక అనౌరసుడైన బిడ్డ ఎవరైనను;

(సీ) మతాంతరణము వలనగాని పునర్మతాంతరణము వలనగాని, హిందూ, బౌద్ధ జైన లేక సిక్కు మతమునకు చెందియున్న వ్యక్తి ఎవరైనను.

(2) ఉపపరిచ్ఛేదము (1) లో ఏమియున్నప్పటికిని, కేంద్ర ప్రభుత్వము రాజపత్రములో అధిసూచనద్వారా అన్యథా ఆదేశించిననేతప్ప, సంవిధానము యొక్క 366వ అనుచ్ఛేదమునందలి ఖండము (25)యొక్క భావములోని ఏదేని అనుసూచిత జనజాతి సభ్యులకు ఈ చట్టములోనిదేదియు వర్తించదు.

(3) ఈ పరిచ్ఛేదమునందలి నిబంధనలనుబట్టి ఈ చట్టము ఏ వ్యక్తికి వర్తించునో ఆ వ్యక్తి, హిందూ మతమునకు చెందినవాడు కాకున్నను, ఈ చట్టమునందలి ఏభాగములోనైనను "హిందువు" అనుపదపరిధిలో చేరియున్నట్లు అన్వయించవలెను.

నిర్వచనములు. 3. ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప—

(ఏ) ''ఆచారము'' మరియు ''వాడుక''అను పదములు దీర్ఘకాలముపాటు నిరంతరముగాను ఏకరూపతతోను పాటింపబడినందున ఏదేని స్థానిక ప్రాంతము, జనజాతి, సమూజము, సముదాయము, లేక కుటుంబములోని హిందువులలో శాసనము వలె అమలు కలిగియున్న ఏదేని నియమమును సూచించును :

అయితే, ఆ నియమము నిశ్చితమైనదై యుండవలెను, మరియు అది అనుచితమైనదిగాగాని లోకనీతికి విరుద్ధమైనదిగాగాని ఉండరాదు ;

అంతేగాక, ఆ నియమము ఒక కుటుంబమునకు మాత్రమే వర్తించెడిదైన సందర్భములో దానిని పాటించుట ఆ కుటుంబము మానుకొని యుండరాదు.

(బీ) "జిల్లాన్యాయస్థానము" అనగా, నగర సివిలు న్యాయస్థానముగల ఏ ప్రాంతములోనైనను ఆ న్యాయస్థానము అనియు, ఏదేని ఇతర ప్రాంతములో ఆరంభిక అధికారిత గల ప్రధాన సివిలు న్యాయస్థానమనియు అర్థము, మరియు ఆపదపరిధిలో రాజ్య ప్రభుత్వము రాజపత్రములో అధిసూచనద్వారా, ఈచట్టములో ఉల్లేఖింపబడిన విషయములను గూర్చి అధికారిత కలిగియుండునట్లుగా నిర్దిష్టపరచు ఏదేని ఇతర సివిలు న్యాయస్థానము చేరియుండును.

(సీ) "పూర్ణరక్తసంబంధము", "అర్ధరక్తసంబంధము":- ఇద్దరు వ్యక్తులు ఒకే పూర్వీకుని వలన ఒకే భార్యకు కలిగిన సంతతి వారైనపుడు పూర్ణరక్తసంబంధము ద్వారాను, ఒకే పూర్వీకునివలన వేరువేరు భార్యలకు కలిగిన సంతతివారైనపుడు అర్ధరక్తసంబంధము ద్వారాను వారు ఒకరికొకరు సంబంధితులని చెప్పబడుదురు.

(డీ) "ఏకోదర రక్తసంబంధము" :— ఇద్దరు వ్యక్తులు ఒకే పూర్వీకురాలికి వేరువేరు భర్తలవలన కలిగిన సంతతి వారైనపుడు వారు ఏకోదర రక్తసంబంధము ద్వారా ఒకరికొకరు సంబంధితులని చెప్పబడుదురు.

విశదీకరణము :— ఖండములు (సీ), (డీ) లలో 'పూర్వీకుడు' అను పదపరిధిలో తండ్రియు: 'పూర్వీకురాలు' అను పదపరిధిలో తల్లియు, చేరియుందురు.

(ఈ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమావళిద్వారా విహితపరిచిన అని అర్థము ;

(ఎఫ్) (i) ఏవ్యక్తి విషయమునసైనను, తల్లిద్వారా పూర్వపరంపరలో (మూడవ తరము కలుపుకొని) మూడు తరముల వరకును, తండ్రిద్వారా పూర్వపరంపరలో (అయిదవ తరము కలుపుకొని) అయిదు తరముల వరకును "సపిండ సంబంధము" విస్తరించును, ప్రతి సందర్భములోను ప్రసక్తి యందున్న వ్యక్తిని మొదటి తరము వానినిగా గణించి ఆ వంశ పరంపరను ఆరోహణ క్రమములో లెక్కించవలెను;

(ii) ఇద్దరు వ్యక్తులలో ఒకరు మరొకరికి సపిండ సంబంధ పరిధిలో పై తరము వంశస్థుడై యున్నను, లేక వారిరువురి సపిండ సంబంధ పరిధిలో వారిరువురికిని చెందెడు పైతరము వంశస్థుడు ఒకరున్నను, వారిరువురు ఒకరికొకరు సపిండులని చెప్పబడుదురు;

(జీ) "వరుసకాని సంబంధము" - ఇద్దరు వ్యక్తులు

(i) ఒకరు మరొకరికి పై తరము వంశస్థుడై ఉన్నచో, లేక

(ii) ఒకరు మరొకరికి పై తరము వంశస్థునికి లేక క్రింది తరము వంశస్థునికి భార్య లేక భర్త అయిఉండినచో, లేక

(iii) ఒకరు మరొకరి సోదరుని, లేక తండ్రి సోదరుని, లేక తల్లి సోదరుని, లేక తాత సోదరుని లేక అవ్వ సోదరుని యొక్క భార్య అయి ఉండినచో, లేక

(iv) ఒకరు మరొకరికి తోబుట్టువైనచో, తోబుట్టువు సంతానమైనచో, లేక వారిరువురు తోబుట్టువుల సంతానమైనచో, వారు వరుస కలువని సంబంధము లోని వారైనట్లు చెప్పబడుదురు.

విశదీకరణము :— (ఎఫ్) మరియు (జీ) ఖండముల నిమిత్తమై, 'సంబంధము' నందు ఈక్రిందివి చేరియుండును:

(i) పూర్ణ-రక్త సంబంధమేకాకుండ అర్ధ లేక ఏకోదర రక్త సంబంధము కూడ,

(ii) ఔరస రక్తసంబంధమేకాకుండ అనౌరస రక్త సంబంధము కూడ,

(iii) రక్త సంబంధమేకాకుండ దత్తతరీత్యా ఏర్పడిన సంబంధముకూడ, మరియు,

ఆ ఖండములలో సంబంధమును గురించిన అన్ని పదములను ఆ ప్రకారముగా అన్వయించవలెను.

ఈ చట్టనకు ఇతర శాసనములను అధిగమించు ప్రభావము.

4. ఈ చట్టములో అన్యథా అభివ్యక్తముగా నిబంధించబడినట్లు తప్ప-

(ఏ) ఈ చట్టము ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము అమలునందున్న హిందూ శాసనమునకు సంబంధించిన ఏదేని శాస్త్ర వాక్యము, నియమము, లేక అర్థాన్వయము, లేదా ఆ శాసనములో భాగమగు ఏదేని ఆచారము, లేక వాడుక, ఈ చట్టములో నిబంధనలు చేయబడిన ఏ విషయములోనైనను ప్రభావరహితమగును;

(బీ) ఈ చట్టము ప్రారంభమగుటకు అవ్యవహితపూర్వము అమలునందున్న ఏదేని ఇతర శాసనము, ఈ చట్టములోనున్న ఏ నిబంధనలకైనను అసంగతముగా ఉన్నంతమేరకు, ప్రభావరహితమగును.

## హిందూ వివాహములు

హిందూ వివాహమునకు షరతులు.

5. ఏ ఇరువురు హిందువులమధ్యనైనను ఈ క్రింది షరతులు నెరవేరినచో, వివాహము జరుగవచ్చును, అవేవనగా :-

(i) వివాహము జరుగునపుడు వరునికి జీవించియున్న భార్యగాని, వధువుకు జీవించియున్న భర్తగాని ఉండరాదు;

(ii) వివాహము జరుగునపుడు వధూవరులలో ఎవరైనను —

(ఏ) మతిస్తిమితములేని కారణముగా చెల్లెడు సమ్మతిని ఈయజాలనివారై ఉండరాదు; లేక

(బీ) చెల్లెడు సమ్మతిని ఈయగలిగి ఉన్నను వివాహమునకును, సంతానోత్పత్తికిని అనువుగానంతటి లేక అనువుగానట్టి రకపు మనోవైకల్యముగలవారై ఉండరాదు; లేక

(సీ) ఉన్మాదమునకు లేక మూర్ఛరోగమునకు మరల మరల గురియగుచుండెడివారు కారాదు;

(iii) వివాహకాలమునాటికి వరునకు ఇరువదియొక్క సంవత్సరముల వయస్సు, వధువుకు పదునెనిమిది సంవత్సరముల వయస్సు నిండియుండవలెను;

(iv) వారిలో ప్రతియొకరికి వర్తించెడి ఆచారము లేక వాడుకను బట్టి వారిద్దరి మధ్య వివాహము జరుగుటకు వీలున్ననే తప్ప, వారు వరుసకాని సంబంధముగలవారై యుండరాదు:

(v) వారిలో ప్రతియొకరికి వర్తించెడి ఆచారము లేక వాడుకనుబట్టి వారిద్దరి మధ్య వివాహము జరుగుటకు వీలున్ననే తప్ప, వారు సపిండులై యుండరాదు.

(vi) x x x x x x

6 x x x x x x

హిందూ వివాహ సంస్కారములు.

7 (1) హిందూ వివాహమును వధూవరులలో ఎవరి ఆచారానుగతమైె రీతుల, మరియు సంస్కారముల ప్రకారమైనను జరపవచ్చును.

(2) అట్టిరీతులు మరియు సంస్కారములలో, సప్తపది (అనగా అగ్నిసాక్షిగా వధూవరులు కలిసి ఏడు అడుగులు నడచుట) ఉడినచో ఏడవ అడుగు వేయుటతో వివాహము సంపూర్తియై వివాహబంధము ఏర్పడును.

హిందూ వివాహములను రిజిస్టరు చేయుట.

8 (1) హిందూ వివాహములను సులువుగా రుజువు పరచుటకై, అట్టి వివాహము జరిగిన వధూవరులు తమ వివాహమునకు సంబంధించిన వివరములను, విహితపరచిన రీతిలోను మరియు అట్టి షరతులకు లోబడియు, అందుకై ఉంచబడిన హిందూ వివాహ రిజిస్టరులో నమోదు చేయించు కొనవచ్చునని నిబంధన చేయుచు, రాజ్యప్రభుత్వము నియమములు చేయవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము(1)లో ఏమి ఉన్నప్పటికిని, రాజ్యములో గాని, అందలి ఏదేని భాగములోగాని అన్ని సందర్భములలోగాని, నిర్దిష్టపరిచెడు సందర్భములలోగాని ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన వివరములను తప్పనిసరిగా నమోదు చేయించవలెనని నిబంధన చేయుట ఆవశ్యకమని లేక ఉపయుక్తమని తాను అభిప్రాయపడినచో, రాజ్య ప్రభుత్వము అట్టి నిబంధన చేయవచ్చును; మరియు ఏదేని అట్టి ఆదేశము జారీ చేయబడిన యెడల, ఈ విషయమున చేయబడిన ఏదేని నియమమును ఉల్లంఘించు ఏ వ్యక్తియైనను ఇరువదియైదు రూపాయల దాక ఉండగల జుర్మానాతో శిక్షింపదగియుండును.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద చేసెడు నియమములన్నింటిని వాటిని చేసిన పిమ్మట వీలైనంత త్వరలో రాజ్యశాసనమండలి సమక్షమున ఉంచవలెను.

(4) హిందూ వివాహ రిజిస్టరును, యుక్తమైన అన్ని వేళలయందు తనిఖీకై అందుబాటులో ఉంచవలెను; అందలి విషయములకు సాక్ష్యముగా ఆ రిజిస్టరు స్వీకరింపదగియుండును; దరఖాస్తు పెట్టుకొని విహితమైన ఫీజును తనకు చెల్లించిన మీదట, రిజిస్ట్రారు అందలి ఉదాహృతులను ధ్రువపరచి ఈయవలెను.

(5) ఈ పరిచ్ఛేదములో ఏమి ఉన్నప్పటికిని, నమోదు కాలేదను కారణమున, ఏ హిందూ వివాహపు శాసనమాన్యతకైనను ఏ విధమైన భంగము కలుగదు.

## దాంపత్యహక్కుల పునఃస్థాపన మరియు న్యాయిక వేర్పాటు

దాంపత్య హక్కుల పునఃస్థాపన.

9. భర్త భార్యతో కలిసియుండుటగాని, భార్య భర్తతో కలిసియుండుటగాని, యుక్తమైన కారణము లేకుండ మానుకొనినప్పుడు, వ్యథిత పక్షకారు, దాంపత్య హక్కుల పునఃస్థాపన కొరకై జిల్లాన్యాయస్థానమునకు అర్జీ ద్వారా దరఖాస్తు పెట్టుకొనవచ్చును; అట్టి అర్జీలో తెలుపబడిన విషయములు యథార్థమనియు, ఆ దరఖాస్తును మంజూరు చేయకుండుటకు శాసనబద్ధ ఆధారమేదియు లేదనియు, న్యాయస్థానమునకు రూఢియైనమీదట అది తదనుసారముగా దాంపత్య హక్కుల పునఃస్థాపనకై డిక్రీని ఈయవచ్చును.

విశదీకరణము :—కలిసియుండుట మానుకొనుటకు యుక్తమైన కారణము ఉన్నదా అను ప్రశ్న ఏర్పడినపుడు, యుక్తమైన కారణము ఉన్నదని రుజువుపరచు భారము కలిసియుండుట మానుకొనిన వ్యక్తిపై ఉండును.

10. (1) వివాహము ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము జరిగినదైనను ప్రారంభమైన పిమ్మట జరిగినదైనను,భార్యగాని భర్తగాని, విడాకులకై అర్జీని సమర్పించుకొనదగు ఆధారములుగా 13వ పరిచ్ఛేదముయొక్క ఉపపరిచ్ఛేదము (1)లో నిర్దిష్టమైన ఆధారములలో దేనిపైనైనను, మరియు భార్య విషయములో ఆ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదము (2)లో నిర్దిష్టమైన ఆధారములలో దేనిపైనైనను కూడ, న్యాయికవేర్పాటు డిక్రీకై ప్రార్థించుచు అర్జీని సమర్పించవచ్చును. న్యాయిక వేర్పాటు.

(2) న్యాయికవేర్పాటుకు డిక్రీ ఒసగబడినయెడల, ఆ తరువాత అర్జీదారుకు ప్రత్యర్థితో దాంపత్యము చేయుబాధ్యత ఉండదు; కాని, వారిరువురిలో ఎవరైనను అర్జీద్వారా దరఖాస్తు పెట్టుకొనినచో, అట్టి అర్జీలో తెలుపబడిన విషయములు యథార్థమని న్యాయస్థానమునకు రూఢి అయిన మీదట ఆ డిక్రీని త్రోసివేయుట న్యాయము, సహేతుకము అని తలచుచో, ఆ డిక్రీని న్యాయస్థానము త్రోసివేయవచ్చును

## వివాహము రద్దగుట, మరియు విడాకులు

11. ఈ చట్టము ప్రారంభమయిన తరువాత జరుపబడిన ఏదేని వివాహము, 5వ పరిచ్ఛేదము యొక్క ఖండములు (i), (iv) మరియు (v)లలో నిర్దిష్టమైన షరతులలో దేనినైనను ఉల్లంఘించినచో, ప్రభావశూన్యమైనదగును; మరియు వివాహపు ఇరుపక్షకారులలో ఒకరు అన్యపక్షకారునిపై అర్జీ సమర్పించిన మీదట రద్దు-డిక్రీ ద్వారా ఆ వివాహము ప్రభావశూన్యమైనదని ప్రఖ్యానించవచ్చును. ప్రభావశూన్య వివాహములు.

12. (1) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వముగాని తరువాతగాని జరుపబడిన ఏ వివాహమైనను, ఈ క్రింది ఆధారములలో దేనిపైనైనను ప్రభావ శూన్యకరణీయమైనదగును, దానిని రద్దు-డిక్రీ ద్వారా రద్దు చేయవచ్చును:— ప్రభావశూన్య కరణీయ వివాహములు.

(ఏ) ప్రత్యర్థి యొక్క నపుంసకత్వము కారణముగా నిషేకము కాకుండుట; లేక

(బీ) వివాహము 5వ పరిచ్ఛేదపు ఖండము (ii)లో నిర్దిష్టమైన షరతును ఉల్లంఘించినదై యుండుట; లేక

(సీ) అర్జీదారు సమ్మతినిగాని, బాల్య వివాహ నిరోధ (సవరణ) చట్టము, 1978 ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము ఉండినట్టి 5వ పరిచ్ఛేదము క్రింద, అర్జీదారు వివాహ విషయమున సంరక్షకుని సమ్మతి అవసరమైనయెడల, అట్టి సంరక్షకుని సమ్మతినిగాని బలాత్కారముగా, లేక సంస్కార స్వభావమును గూర్చియైనను ప్రత్యర్థికి సంబంధించిన ఏదేని ముఖ్య విషయమును లేదా పరిస్థితిని గూర్చియైనను కపటముతో పొందియుండుట; లేక

(డీ) వివాహ కాలమునాటికి అర్జీదారు వలన కాక మరొక వ్యక్తివలన ప్రత్యర్థి గర్భవతియైయుండుట.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమిఉన్నప్పటికిని,—

(ఏ) ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (సీ)లో నిర్దిష్టమైన ఆధారముపై వివాహమును రద్దు చేయుటకైన అర్జీ ఏదియు—

(i) బలప్రయోగము ఆగిపోయిన తరువాత, లేక సందర్భానుసారముగ, కపటము కనుగొనబడిన తరువాత ఒక సంవత్సరము గడచినమీదట ఆ అర్జీ సమర్పింపబడినచో, లేక

(ii) బలాత్కారము ఆగిపోయిన తరువాత, లేక సందర్భానుసారముగ, కపటము కనుగొనబడిన తరువాత,అర్జీదారు ఆ వివాహపు అన్యపక్షకారుతో భర్తగా, లేక భార్యగా, తన సంపూర్ణ సమ్మతితో కాపురము చేసియుండినచో;

గ్రహింపబడరాదు

(బీ) ఉపపరిచ్ఛేదము (1) యొక్క ఖండము (డి)లో నిర్దిష్టమైన ఆధారముపై వివాహమును రద్దు చేయుటకైన అర్జీ ఏదియు—

(i) అర్జీలో చెప్పబడిన సంగతులను గూర్చి అర్జీదారునకు వివాహకాలమున తెలియకుండెననియు;

(ii) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము జరుపబడిన వివాహ విషయములో, అట్లు ప్రారంభమైన ఒక సంవత్సరము లోపలను, చట్టము ప్రారంభమైన తరువాత జరుపబడిన వివాహము విషయములో, వివాహమైనతేదీ నుండి ఒక సంవత్సరములోపలను, చర్యలు తేబడినవనియు; మరియు

(iii) సదరు ఆధారమున్నదని అర్జీదారు కనుగొనినప్పటి నుండి అర్జీదారు సమ్మతితో సంభోగము జరుగలేదనియు;

న్యాయస్థానమునకు రూఢియైననే తప్ప, గ్రహింపబడరాదు.

విడాకులు.

13. (1) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వముగాని, తరువాత గాని జరుపబడిన ఏదేని వివాహము, భర్తగాని భార్యగాని సమర్పించిన అర్జీపై, ఈ క్రింది ఆధారములలోదేనిపైనైనను, విడాకుల డిక్రీద్వారా విచ్ఛేదము చేయబడవచ్చును ప్రత్యర్థి :-

(i) వివాహము జరిగిన తరువాత తనభార్యగానట్టి, లేక తనభర్తగానట్టి, ఎవరేని వ్యక్తితో ఇచ్ఛాపూర్వకముగా సంభోగించుట, లేక

(i-ఏ) వివాహము జరిగిన పిమ్మట, అర్జీదారుపట్ల క్రూరముగ ప్రవర్తించుట; లేక

(i-బీ) అర్జీ సమర్పించబడుటకు అవ్యవహితపూర్వము నిరంతరముగా రెండు సంవత్సరములకు తగ్గని కాలముపాటు అర్జీదారును విడిచిపెట్టుట; లేక

(ii) మరొక మతమునకు మారినందువలన హిందూమతమునకు చెందకుండుట; లేక

(iii) మతిస్థిమితము లేకుండుట నయముకాజాలనంతగా ఉండుట లేక ప్రత్యర్థితో అర్జీదారు కాపురము చేయవచ్చునని సహేతుకముగా తలచుటకు వీలులేనటువంటి, వీలులేనంతటి మనోవైకల్యమునకు నిరంతరముగా లేదా అప్పుడప్పుడు గురియగుట;

<u>విశదీకరణము :—</u> ఈ ఖండములో,-

(ఏ) "మనోవైకల్యము" అనగా మానసికమైనజబ్బు, ఆగిపోయిన లేదా అసంపూర్ణమగు మనోవికాసము, చిత్తచాంచల్యము, లేక మానసికమైన ఇతర వైకల్యము లేదా అశక్తత అని అర్థము, మరియు అందు మనోభాజనము చేరియుండును;

(బీ) "చిత్తచాంచల్యము" అనగా, వైద్య చికిత్స అవసరమైనదైనను, కాకున్నను లేక వైద్య చికిత్సకు లొంగునది అయినను కాకున్నను, (బుద్ధి మాంద్యత అందుచేరి యున్నను చేరకున్నను) అతిగా కలహించునట్టి లేక విపరీతముగా బాధ్యతారహితమైనట్టి ప్రవర్తనగా పరిణమించు మానసికమైన నిరంతర వైకల్యము లేదా అశక్తత అని అర్థము; లేక

(iv) తీవ్రమైన మరియు నయము కాజాలని కుష్టువ్యాధికి గురియగుట; లేక

(v) సాంక్రామిక సుఖరోగమునకు గురియగుట; లేక

(vi) ఏదేని మతసంస్థలో చేరి సన్యసించుట; లేక

(vii) జీవించియున్నచో సహజముగా ఆ సంగతినిగూర్చి వినియుండెడి వ్యక్తులు, ఏడు సంవత్సరముల లేక అంతకు మించిన కాలముపాటు ప్రత్యర్థి అట్లు జీవించి యుండెనని వినియుండకుండుట.

(viii) [x x x x]

(ix) [x x x x]

విశదీకరణము :— ఈ ఉపపరిచ్ఛేదములో "విడిచిపెట్టుట" అనగా అర్జీదారు వివాహము చేసికొనిన వ్యక్తి యుక్తమైన కారణము లేకుండను, అర్జీదారు యొక్క సమ్మతి లేకుండను, లేక అర్జీదారు ఇష్టమునకు వ్యతిరేకముగాను అర్జీదారును విడిచిపెట్టుట అని అర్థము, మరియు ఇందు అర్జీదారు వివాహము చేసికొనినవ్యక్తి అర్జీదారును బుద్ధిపూర్వకముగా ఉపేక్ష చేయుట చేరియుండును, ఈ పదముయొక్క వ్యాకరణ రూపాంతరములను సజాతీయ పద బంధములను తదనుసారముగా అన్వయించవలెను.

(1-ఏ) వివాహము ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము జరిగినదైనను, తరువాత జరిగినదైనను, దంపతులలో ఎవరైనను—

(i) ఆ దంపతులు పక్షకారులుగా ఉండిన చర్యలో న్యాయిక వేర్పాటుకు డిక్రీ ఈయబడిన తరువాత ఒక సంవత్సరము లేక అంతకు మించిన కాలమువరకు వారు తిరిగి కలసి కాపురము చేయలేదను ఆధారముపైకూడ; లేక

(ii) ఆ దంపతులు పక్షకారులుగా ఉండిన చర్యలో దాంపత్య హక్కుల పునఃస్థాపనకు డిక్రీ ఈయబడిన తరువాత ఒక సంవత్సరము లేక అంతకు మించిన కాలము వరకు వారిమధ్య దాంపత్య హక్కుల పునఃస్థాపన జరుగలేదను ఆధారముపైకూడ;

తమకు విడాకుల డిక్రీనిచ్చి, వివాహమును విచ్ఛేదము చేయవలసినదని అర్జీని సమర్పించవచ్చును.

(2) భార్య విడాకుల డిక్రీద్వారా వివాహ విచ్ఛేదమునకై ఈ క్రింది ఆధారములలో దేనిపైనైనను కూడ అర్జీని సమర్పించవచ్చును :—

(i) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము జరుపబడిన తన వివాహ విషయములో, అట్టి ప్రారంభమునకు పూర్వము భర్త మరల వివాహము చేసికొనియుండుట, లేక అట్టి ప్రారంభమునకు పూర్వము భర్త వివాహము చేసికొనిన ఎవరేని ఇతర భార్య, అర్జీదారుయొక్క వివాహము జరిగిన కాలమున జీవించియుండుట :

అయితే, వీటిలో ఏ సందర్భములోనైనను అర్జీ సమర్పించు సమయమున ఆ ఇతర భార్య జీవించియుండవలెను; లేక

(ii) భర్త, వివాహానంతరము మానభంగము, పుంమైథునము లేక పశుగమనము చేసియుండుట; లేక

(iii) హిందూ దత్తతల మరియు భరణ-పోషణముల చట్టము, 1956 యొక్క 18వ పరిచ్ఛేదము క్రింద, లేక క్రిమినలు ప్రక్రియాస్మృతి, 1973 యొక్క 125వ పరిచ్ఛేదము క్రింద (లేక దానిస్థానమునందుండిన క్రిమినలు ప్రక్రియాస్మృతి, 1898 యొక్క 488వ పరిచ్ఛేదము క్రింద) భార్యకు ఆమె వేరుగ ఉంటూఉండినను, భరణమును అధినిర్ణయించుచు భర్తపై, డిక్రీగాని, సందర్భానుసారముగ, ఉత్తరువుగాని ఈయబడి, మరియు అట్టి డిక్రీగాని ఉత్తరువుగాని ఈయబడినప్పటినుండి, ఒక సంవత్సరము లేదా అంతకు మించిన కాలము వరకు ఆ దంపతులు తిరిగి కలసి కాపురము చేయకుండుట; లేక

(1956 లోని 78వ చట్టము)
(1974 లోని 2వ చట్టము)
(1898 లోని 5వ చట్టము)

(iv) ఆమె వివాహము (నిషేకముతో సంపూర్తి అయినదైనను కాకున్నను) ఆమెకు పదునైదు సంవత్సరముల వయస్సు నిండక పూర్వము జరుపబడియుండి, ఆమెకు ఆ వయస్సు వచ్చిన పిమ్మట, అయితే పదునెనిమిది సంవత్సరముల వయస్సు నిండకపూర్వము, ఆ వివాహమును ఆమె నిరాకరించి యుండుట.

విశదీకరణము :— వివాహము, వివాహ శాసనముల (సవరణ) చట్టము, 1976 ప్రారంభమగుటకు పూర్వము జరిగినదైనను, తరువాత జరిగినదైనను, ఈ ఖండము వర్తించును.

విడాకుల చర్యలలో ప్రత్యామ్నాయ పరిహారము.

13-ఏ. విడాకుల డిక్రీద్వారా వివాహ విచ్ఛేదనమునకై సమర్పింపబడిన అర్జీపై, ఈ చట్టము క్రింద ఏదేని చర్యలో, 13వ పరిచ్ఛేదములోని ఉపపరిచ్ఛేదము (I) యొక్క ఖండములు (ii), (vi) మరియు (vii) లలో పేర్కొనబడిన ఆధారములపై అర్జీపెట్టుకొనినప్పుడు తప్ప, ఆ కేసు పరిస్థితుల దృష్ట్యా విడాకులకు బదులుగా న్యాయిక వేర్పాటుకు డిక్రీని ఇచ్చుట న్యాయమని తాను తలచినయెడల న్యాయస్థానము అట్టి డిక్రీని ఈయవచ్చును.

పరస్పర సమ్మతితో విడాకులు.

13-బీ. (1) ఈ చట్టపు నిబంధనలకు లోబడి, దంపతులిరువురు, తమ వివాహము వివాహ శాసనముల (సవరణ) చట్టము, 1976 ప్రారంభమగుటకు పూర్వము జరిగినదైనను తర్వాతజరిగినదైనను, తాము ఒక సంవత్సరము, లేక అంతకు మించిన కాలమునుండి వేరు వేరుగా ఉంటున్నామనియు, కలసి కాపురము చేయలేకపోయినామనియు, వివాహము విచ్ఛేదనము చేయబడవలెనని పరస్పర అంగీకారమునకు వచ్చినామనియు తెలిపి, ఈ ఆధారముపై విడాకుల డిక్రీద్వారా వివాహ విచ్ఛేదనము కోరుచూ సంయుక్తముగా అర్జీని జిల్లాన్యాయస్థానమునకు సమర్పించుకొనవచ్చును.

(2) దంపతులు ఉపపరిచ్ఛేదము (I) లో నిర్దేశించిన అర్జీని సమర్పించిన తేదీ తరువాత ఆరుమాసములకు ముందుగా కాకుండను, పదునెనిమిది మాసములు దాటకుండను చేసిన విజ్ఞప్తిపై దంపతుల విన్నపముల నాకర్ణించి తాను సబబని తలచు విచారణను జరిపిన పిమ్మట, వివాహము జరుపబడినదనియు, ఆ అర్జీలో చెప్పబడిన విషయములు యథార్థమైనవనియు తనకు రూఢియైన మీదట ఆ లోగా అర్జీ ఉపసంహరించుకొనబడనిచో, డిక్రీ తేదీనుండి ఆ వివాహము విచ్ఛిన్నమైన దని ప్రఖ్యానించుచు న్యాయస్థానము విడాకుల డిక్రీని ఈయవలెను.

వివాహమైన ఒక సంవత్సరములోగా విడాకుల కొరకు ఏ అర్జీని సమర్పించరాదు.

14. (1) ఈ చట్టములో ఏమియున్నప్పటికిని, విడాకుల డిక్రీద్వారా వివాహ విచ్ఛేదనముకోరు ఏ అర్జీనైనను గ్రహించుటకు, వివాహము జరిగిన తేదీనుండి అట్టి అర్జీ సమర్పించు తేదీనాటికి ఒక సంవత్సరము గడచియుండిననే తప్ప, ఏ న్యాయస్థానమునకును సమర్థత ఉండదు :

అయితే, ఈ విషయమున ఉన్నత న్యాయస్థానముచేయు నియమావళి ననుసరించి న్యాయస్థానమునకు దరఖాస్తు పెట్టబడిన మీదట అర్జీదారునకు అసాధారణమైన కష్టము కలిగించునవిగా లేక ప్రత్యర్థియందు అసాధారణమైన దుర్వర్తనము చూపునవిగా కేసు పరిస్థితులు ఉన్నవను ఆధారముపై, వివాహమైన తేదీనుండి ఒక సంవత్సరము గడవక పూర్వమే ఆ అర్జీ సమర్పణను న్యాయస్థానము అనుమతించవచ్చును. కాని, కేసు స్వభావమును మరుగుపరచి లేక దానిని గురించి తప్పుడు సమాచారమిచ్చి అర్జీని సమర్పించుటకు అర్జీదారు అనుమతిని పొంది యుండెనని న్యాయస్థానమునకు ఆ అర్జీని ఆకర్ణించినపుడు తోచినయెడల, న్యాయస్థానము, డిక్రీని ఇచ్చుచో, వివాహము జరిగిన తేదీనుండి ఒక సంవత్సరము ముగియువరకు ఆ డిక్రీ అమలులోనికి రాదను షరతుతో ఈయవచ్చును, లేక ఆ అర్జీలో చెప్పబడిన సంగతులపైగాని, సారతః అట్టి సంగతులపైగాని అట్టి ఒక సంవత్సరము ముగిసిన తరువాత మరొక అర్జీని సమర్పించుటకు ఎట్టి భంగము లేకుండ, ఆ అర్జీని కొట్టివేయవచ్చును.

(2) వివాహమైన తేదీనుండి ఒక సంవత్సరము ముగియుటకు పూర్వమే విడాకుల కొరకు అర్జీని సమర్పించుటకై అనుమతిని కోరుచు ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ఏదేని దరఖాస్తును పరిష్కారము చేయుటలో, ఆ వివాహము వలన కలిగిన బిడ్డల హితమును, మరియు, అట్టి ఒక సంవత్సరము ముగియులోపల పక్షకారుల మధ్య సఖ్యత ఏర్పడుట సంభవమా కాదా అను విషయమును న్యాయస్థానము దృష్టియందుంచుకొనవలెను.

15. విడాకుల డిక్రీద్వారా వివాహము విచ్ఛేదము చేయబడి, ఆ డిక్రీపై అపీలు చేయుటకు హక్కులేనప్పుడుగాని, అటువంటి అపీలు చేయుటకు హక్కు ఉండి అపీలు సమర్పించకుండగనే అపీలు చేయు కాలము ముగిసినప్పుడుగాని, అపీలు సమర్పింపబడి కొట్టివేయబడినప్పుడుగాని, వివాహపక్షకారులిరువురిలో ఎవరికైనను మరల వివాహము చేసికొనుట శాసనసమ్మతమై యుండును.

విడాకులు పొందిన వ్యక్తులు మరల వివాహమును ఎప్పుడు చేసికొనవచ్చును.

16. (1) 11వ పరిచ్ఛేదము క్రింద ఏదేని వివాహము ప్రభావశూన్యమైనప్పటికిని, అట్టి వివాహమువలనకలిగి ఆ వివాహము చెల్లెడిదైయుండినచో ఔరస సంతానమైయుండెడి ఏ బిడ్డయైనను ఆ బిడ్డ వివాహ శాసనముల (సవరణ) చట్టము, 1976 ప్రారంభమగుటకు పూర్వము జన్మించినను తరువాత జన్మించినను, ఆ వివాహ విషయమున ఈ చట్టము క్రింద రద్దు డిక్రీ ఈయబడినను ఈయబడకున్నను, ఈ చట్టము క్రింద అర్జీపై కాకుండ అన్యథా ఆ వివాహము ప్రభావశూన్యమైనదని నిర్ణయింపబడినను నిర్ణయింపబడకున్నను, ఔరస సంతానమగును.

ప్రభావశూన్యమైన మరియు ప్రభావ శూన్యకరణీయమైన వివాహముద్వారా కలిగిన సంతానపు ఔరసత్వము.

(2) 12వ పరిచ్ఛేదము క్రింద ప్రభావ శూన్యకరణీయమైన వివాహ విషయములో రద్దు-డిక్రీ ఈయబడినను, ఆ డిక్రీతేదీన ఆ వివాహము రద్దు చేయుటకు బదులు విచ్ఛేదము చేయ బడియుండినచో, ఆ వివాహపక్షకారులకు ఔరస సంతానమై యుండెడి ఏ బిడ్డయైనను, ఆ డిక్రీ ఇచ్చుటకు ముందు జన్మించినను, లేక గర్భస్థముగా ఉన్నను, రద్దు - డిక్రీ ఈయబడినప్పటికిని వారి ఔరస సంతానముగనే భావింపబడును.

(3) ప్రభావశూన్యమైనట్టి లేక 12వ పరిచ్ఛేదము క్రింద రద్దు - డిక్రీ ద్వారా రద్దు చేయబడినట్టి వివాహమువలన కలిగిన ఏ బిడ్డకు ఈ చట్టము చేయబడనిచో ఆబిడ్డ తన తల్లిదండ్రుల ఔరస సంతానముకాదను కారణమునతన తల్లిదండ్రులదికానట్టి ఆస్తిలో, లేక ఆస్తికి ఏహక్కులను కలిగియుండుటకు లేదా పొందుటకు అర్హత యుండెడిదికాదో ఆ హక్కులను ఏ సందర్భములోనైనను ఉపపరిచ్ఛేదము (1) లేక (2)లో ఉన్నదేదియు ఆబిడ్డకు కలుగజేయునదిగా అన్వయింపబడరాదు.

17. ఈ చట్టము ప్రారంభమైన తరువాత ఇరువురు హిందువుల మధ్య జరుగు ఏదేని వివాహము, అట్టి వివాహపు తేదీన వారిలో ఎవరికైనను భర్తగాని భార్యగాని జీవించియున్నచో, ప్రభావశూన్యమైనదగును భారతశిక్షాస్మృతి యొక్క 494వ మరియు 495వ పరిచ్ఛేదముల నిబంధనలు తదనుసారముగా వర్తించును.

ద్వివాహిత్వమునకు శిక్ష.

18. 5వ పరిచ్ఛేదము యొక్క (iii), (iv), (v), (....) ఖండములలో నిర్దిష్టమైన షరతులను ఉల్లంఘించుచు తన వివాహమును ఈ చట్టము క్రింద జరిపించుకొను ప్రతి వ్యక్తియు—

హిందూ వివాహములో పాటింపవలసిన కొన్ని ఇతర షరతుల ఉల్లంఘనకు శిక్ష.

(ఏ) 5వ పరిచ్ఛేదము యొక్క ఖండము (iii) లో నిర్దిష్టమైన షరతులను ఉల్లంఘించిన సందర్భములో, పదునైదు దినముల దాక ఉండగల సాధారణ కారావాసముతో, లేక వేయి రూపాయల దాక ఉండగల జుర్మానాతో, లేక ఈ రెండింటితో,

(బీ) 5వ పరిచ్ఛేదము యొక్క ఖండము (iv) లేక ఖండము (v) లో నిర్దిష్టమైన షరతులను ఉల్లంఘించిన సందర్భములో, ఒక మాసముదాక ఉండగల సాధారణ కారావాసముతో, లేక వేయి రూపాయలదాక ఉండగల జుర్మానాతో, లేక ఈ రెండింటితో,

(సీ) x x x x x

శిక్షింపబడును.

## అధికారిత, మరియు ప్రక్రియ

ఆర్జీ ఏ న్యాయస్థానములో సమర్పించవలెను.

19. ఈ చట్టము క్రింద ప్రతి ఆర్జీని ఏ జిల్లాన్యాయస్థానపు సాధారణ ఆరంభిక సివిలు అధికారిత యొక్క స్థానిక హద్దులలో—

(i) వివాహము జరుపబడినదో; లేక

(ii) ఆర్జీ సమర్పించు సమయమున, ప్రత్యర్థి నివసించుచుండునో; లేక

(iii) కడపటిసారిగ వివాహపక్షకారులు కలిసి నివసించిరో; లేక

(iv) అర్జీని సమర్పించు సమయమున ప్రత్యర్థి ఈ చట్టము వర్తించు రాజ్యక్షేత్రముల వెలుపల నివసించుచున్న యెడల, లేక అతడు జీవించియుండియున్నచో సహజముగా అతని జాడను గూర్చి వినియుండెడి వ్యక్తులు ఏడు సంవత్సరముల లేదా అంతకెక్కువ కాలముపాటు అతడు జీవించియున్నట్లు వినియుండనట్లయితే, అర్జీని సమర్పించు సమయమున ఆర్జీదారు నివసించుచుండునో,

ఆ జిల్లాన్యాయస్థానమునకు సమర్పించవలెను.

ఆర్జీలోని విషయములు వాటి సత్యాపనము.

20. (1) ఈ చట్టము క్రింద సమర్పింపబడు ప్రతి ఆర్జీలోను, అందు కోరిన పరిహారమునకు ఆధారభూతములైన సంగతులను, కేసు స్వభావమును బట్టి వీలగునంత స్పష్టముగా తెలుపవలెను; 11వ పరిచ్ఛేదము క్రింది అర్జీలో తప్ప, ఆర్జీదారుకు వివాహ అన్యపక్షకారుకు మధ్య లాలూచీ ఏదియు జరుగలేదని కూడతెలుపవలెను.

(2) దావాపత్రములను శాసనప్రకారము సత్యాపనము చేయవలసిన రీతిలో అర్జీదారుగాని మరొక సమర్థ వ్యక్తిగాని ఈ చట్టము క్రింది ప్రతి ఆర్జీలోని విషయములను సత్యాపనము యవలెను; ఆకర్ణన సమయమున వాటిని సాక్ష్యముగా ఉపయోగించవచ్చును.

1908 లోని 5వ చట్టపు వర్తింపు.

21. ఈ చట్టములోగల ఇతర నిబంధనలకును ఈ విషయమున ఉన్నత న్యాయ స్థానము చేయునట్టి నియమావళికిని లోబడి, ఈ చట్టము క్రింది చర్యలన్నిటిని, వీలైనంతవరకు సివిలు ప్రక్రియాస్మృతి, 1908 ప్రకారము జరుపవలెను.

కొన్ని సందర్భములలో అర్జీలను బదిలీ చేయుటకు అధికారము.

21ఏ. (1) ఎపుడైనా——

(ఏ) 10వ పరిచ్ఛేదము క్రింద న్యాయిక వేర్పాటు డిక్రీకైగాని, 13వ పరిచ్ఛేదము క్రింద విడాకుల డిక్రీకైగాని ప్రార్థించుచు దంపతులిరువురిలో ఒకరు, ఈ చట్టము క్రింద అధికారితగల జిల్లాన్యాయస్థానమునకు అర్జీ సమర్పించియుండి; మరియు

(బీ) అటు తరువాత 10వ పరిచ్ఛేదము క్రింద న్యాయిక వేర్పాటు డిక్రీకై గాని, 13వ పరిచ్ఛేదము క్రింద విడాకుల డిక్రీకై గాని ప్రార్థించుచు ఏ ఆధారముపైనైనను ఆ దంపతులు ఇరువురిలో రెండవవారు ఈ చట్టము క్రింద అదే జిల్లాన్యాయస్థానములో గాని, ఆ రాజ్యములోని లేక వేరొక రాజ్యములోని వేరొక జిల్లాన్యాయస్థానములోగాని అర్జీ సమర్పించిన యెడల,

ఆ అర్జీవిషయమున ఉపపరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచినట్లు వ్యవహరించవలెను.

(2) ఉపపరిచ్ఛేదము (1) వర్తించు సందర్భములో—

(ఏ) ఆ అర్జీలు ఒకే జిల్లాన్యాయస్థానమునకు సమర్పింపబడినచో, ఆ జిల్లాన్యాయస్థానము ఆ రెండు ఆర్జీలను కలిపి విచారణచేసి ఆకర్ణించవలెను;

(బీ) ఆ అర్జీలను వేరు వేరు జిల్లాన్యాయస్థానములకు సమర్పించినచో, మొదటి అర్జీ సమర్పింపబడిన న్యాయస్థానమునకు తరువాత సమర్పింపబడిన అర్జీని బదిలీ చేయవలెను; మరియు మొదటి అర్జీ సమర్పింపబడిన జిల్లాన్యాయస్థానము ఆ రెండు అర్జీలను కలిపి ఆకర్ణించి పరిష్కరించవలెను.

(3) ఉపపరిచ్ఛేదము (2) యొక్క ఖండము (బీ) వర్తించు సందర్భములో, తరువాతి అర్జీ సమర్పింపబడిన జిల్లాన్యాయస్థానమునుండి ఏదేని దావాను, లేక చర్యను, మొదటి అర్జీ ఏ జిల్లాన్యాయస్థానములో ఉన్నదో ఆ జిల్లాన్యాయస్థానమునకు మార్చుటకు సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద సమర్థమైన న్యాయస్థానముగాని, సందర్భానుసారముగా, ప్రభుత్వముగాని అట్టి తరువాతి అర్జీని బదిలీచేయుటకు, ఆ స్మృతి క్రింద అట్లు చేయుటకు తనకు అధికారమీయబడి యుండిన ఎట్లో అట్లే, తన అధికారములను వినియోగించవలెను. 1908 లోని 5వ చట్టము.

21-బీ. (1) ఈ చట్టము క్రింది అర్జీయొక్క విచారణను, వ్రాసి ఉంచవలసిన కారణములపై మరునటి దినమునకు మించి వాయిదావేయుట అవసరమని న్యాయస్థానము తలచిననేతప్ప, ఆ విచారణకు సంబంధించి న్యాయహితమునకు అనుగుణముగా ఆచరణీయమగు మేరకు, ఆ విచారణ పూర్తి అగువరకు అనుదినము జరుపవలెను. చట్టము క్రింద అర్జీల విచారణకు, పరిష్కారమునకు సంబంధించిన ప్రత్యేక నిబంధన.

(2) ఈ చట్టము క్రింది ప్రతి అర్జీని సాధ్యమైనంత త్వరగా విచారణచేయవలెను అర్జీ నోటీసును ప్రత్యర్థికి తామీలు చేసిన తేదినుండి ఆరు మాసములలో విచారణను పూర్తి చేయుటకు ప్రయత్నించవలెను.

(3) ఈ చట్టము క్రింది ప్రతి అపీలును సాధ్యమైనంత త్వరగా ఆకర్ణించవలెను ప్రత్యర్థికి అపీలు నోటీసు తామీలు జేసిన తేదీనుండి మూడు మాసములలో ఆకర్ణనను పూర్తి చేయుటకు ప్రయత్నించవలెను.

21-సీ. దీనికి విరుద్ధముగ ఏ అనుశాసనములోనైనను ఏమియున్నప్పటికిని, ఈ చట్టము క్రింది అర్జీ విచారణయందు ఏదేని చర్యలో, తగురీతిగా స్టాంపు వేయలేదను, లేక రిజిస్టరు చేయలేదను ఆధారముపై ఏ దస్తావేజు గాని సాక్ష్యములో స్వీకరించబడుటకు అయోగ్యమైనది కారాదు. దస్తావేజీ సాక్ష్యము.

22. (1) ఈ చట్టము క్రింది ప్రతి చర్యను గుట్టుగా జరుపవలెను; అట్టి ఏదేని చర్యకు సంబంధించి ఉన్నత న్యాయస్థానపు లేక సర్వోన్నత న్యాయస్థానపు తీర్పును ఆ న్యాయస్థానపు పూర్వ అనుజ్ఞతో ముద్రించుట, లేక ప్రచురించుట తప్ప, అట్టి చర్యకు సంబంధించిన ఏ విషయమునైనను, ఏ వ్యక్తియైనను ముద్రించుట లేక ప్రచురించుట శాసన సమ్మతము కాదు. చర్యలను గుట్టుగా జరుపవలసియుండుట, వాటిని ముద్రించరాదు లేక ప్రచురించరాదు.

(2) ఉపపరిచ్ఛేదము (1) లోని నిబంధనలను ఉల్లంఘించి ఏ వ్యక్తియైనను ఏదేని విషయమును ముద్రించినచో, లేక ప్రచురించినచో అతడు వేయి రూపాయల దాక ఉండగల జుర్మానాతో శిక్షింపబడును.

23. (1) ఈ చట్టము క్రింది ఏ చర్యలోనైనను, ఉత్తరవాదము ఉన్నను లేకున్నను- చర్యలలో డిక్రీ.

(ఏ) పరిహారము ఇచ్చుటకు ఏదేని ఆధారము ఉన్నదనియు, అర్జీదారు అట్టి పరిహారమునకై తనదేయగు తప్పిదము లేక నిరర్హత నుండి- 5వ పరిచ్ఛేదము యొక్క ఖండము (ii) లోని ఉపఖండము (ఏ) లేక ఉపఖండము (బీ) లేక ఉపఖండము (సీ) లో నిర్దిష్టమైన ఆధారముపై అతడు పరిహారము కోరిన సందర్భములలో తప్ప- ఏ విధముగను అనుకూల్యము పొందుటలేదనియు; మరియు

(బీ) అర్జీలోని ఆధారము 13వ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదము (1) లోని ఖండము (i) లో నిర్దిష్టమైనదైన యెడల, ఫిర్యాదుకు గురియైన కార్యము, లేక కార్యముల విషయమున అర్జీదారు ఏ రీతిగనూ సహకరించిగాని, మౌనానుకూలతజూపి గాని, క్షమించిగాని ఉండలేదనియు లేక అర్జీకి ఆధారము క్రూర ప్రవర్తనము అయినయెడల, అర్జీదారు ఆ క్రూర ప్రవర్తనమును ఏరీతిగనూ క్షమించలేదనియు; మరియు

(బీ-బీ) పరస్పర సమ్మతి ఆధారముగా విడాకులను కోరినప్పుడు, అట్టి సమ్మతి బలప్రయోగముతో, కపటముతో, లేక అనుచితమైన ఒత్తిడితో పొందబడలేదనియు;

(సి) 11వ పరిచ్ఛేదము క్రింద సమర్పింపబడినది కానట్టిదగు అర్జీని ప్రత్యర్థితో లాలూచిపడి సమర్పించలేదనియు, లేదా అట్లు ఆ వ్యవహారమును నడిపిచుటలేదనియు; మరియు

(డి) చర్యను ప్రారంభించుటలో అనావశ్యకమైన లేక అనుచితమైన జాప్యము ఏదియు జరుగలేదనియు; మరియు

(ఈ) పరిహారము మంజూరు చేయకుండుటకు ఇతర శాసనబద్ధ ఆధారమేదియు లేదనియు

న్యాయస్థానము అభిప్రాయపడినచో, అప్పుడు, అట్టి సందర్భములో మాత్రమే న్యాయస్థానము తదనుసారముగా అట్టి పరిహారమునొసగు డిక్రీ ఈయవలెను.

(2) ఈ చట్టము క్రింద ఏదేని పరిహారమును మంజూరు చేయుటకై ఉపక్రమించుటకు పూర్వము కేసుయొక్క స్వభావమును, పరిస్థితులనుబట్టి పక్షకారుల మధ్య సఖ్యతను కుదుర్చుటకు వీలగు ప్రతి సందర్భములోను, ముందుగా అందుకై సర్వ ప్రయత్నములు చేయుట న్యాయస్థానము యొక్క కర్తవ్యమైయుండును :

అయితే, 13వ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదము (1) లోని ఖండము (ii), ఖండము (iii), ఖండము (iv), ఖండము (v), ఖండము (vi), లేక ఖండము (vii) లో నిర్దిష్టమైన ఆధారములలో దేనిపైగాని పరిహారమును కోరినట్టి ఏ చర్యకైనను ఈ ఉపపరిచ్ఛేదములో నున్నదేదియు వర్తించదు.

(3) అట్టి సఖ్యతను కుదుర్చుటలో న్యాయస్థానమునకు సహాయపడు నిమిత్తము, పక్షకారులు కోరినచో, లేక న్యాయస్థానము న్యాయమని, సముచితమని తలచినచో, ఆ చర్యలను పదునైదు దినములకు మించని యుక్తమైన కాలావధి వరకు వాయిదా వేసి, పక్షకారులు అందుకై పేర్కొనిన ఎవరేని వ్యక్తికిగాని, పక్షకారులు ఏ వ్యక్తినీ పేర్కొననిచో న్యాయస్థానము నామనిర్దేశము చేయు ఎవరేని వ్యక్తికిగాని, సఖ్యత కుదరచ్చువీలగునా, సఖ్యత కుదిరినదా అనుదానిని గూర్చి న్యాయస్థానమునకు నివేదికను అందజేయ వలెనను ఆదేశముతో, ఆ విషయమును అప్పగించవచ్చును; న్యాయస్థానము ఆ చర్యను పరిష్కారము చేయుటలో ఆ నివేదికను తగురీతిగా దృష్టియందుంచుకొనవలెను.

(4) విడాకుల డిక్రీ ద్వారా వివాహ విచ్ఛేదము చేయబడిన ప్రతి సందర్భములోను, ఆ డిక్రీ ఇచ్చు న్యాయస్థానము, డిక్రీ నకలును పక్షకారులకు చెరియొకటి, మూల్యరహితముగ ఈయవలెను.

విడాకుల చర్యలలోను, ఇతర చర్యలతోను పత్యర్థికి పరిహారము.

23ఏ. విడాకులకొరకైన, లేక న్యాయిక వేర్పాటు కొరకైన లేక దాంపత్య హక్కుల పునఃస్థాపన కొరకైన ఏదేని చర్యలో కోరిన పరిహారము ఈయబడుటకు, అర్జీదారు వ్యభిచరించినట్లు, క్రూరముగా ప్రవర్తించినట్లు, తనను విడిచిపెట్టినట్లు ఆధారమును చూపుచు ప్రత్యర్థి తన అభ్యంతరము తెలుపుటయేగాక, ఆ ఆధారముపై ఈ చట్టము క్రింద ఏదేని పరిహారము కొరకు ఎదిరి-క్లెయిము కూడ చేయవచ్చును; అర్జీదారు వ్యభిచరించినట్లు, క్రూరముగా ప్రవర్తించినట్లు లేక విడిచిపెట్టినట్లు రుజువయినచో న్యాయస్థానము ప్రత్యర్థికి, అతడు లేక ఆమె ఆ ఆధారముపై అట్టి పరిహారమును కోరుచు అర్జీ సమర్పించుకొని యుండినచో అతనికి లేక ఆమెకు ఈ చట్టము క్రింద హక్కు ఉండియుండెడి పరిహారమును ఈయవచ్చును.

వ్యాజ్యకాలమున భరణ-పోషణము, మరియు చర్యలకగు వ్యయము.

24. ఈచట్టము క్రింద ఏ చర్యలోనైనను భార్యకు, లేక, సందర్భానుసారముగ, భర్తకు, తనను తాను పోషించుకొనుటకు, మరియు, చర్యలకు అవసరమగు వ్యయమును భరించుటకు సరిపోవునంత సొంత ఆదాయమేదియు లేదని న్యాయస్థానమునకు తోచినయెడల, ఆ భార్య గాని భర్తగాని దరఖాస్తు పెట్టుకొనిన మీదట, చర్యలకగు వ్యయము చెల్లించవలసినదనియును, అర్జీదారుయొక్క సొంతరాబడిని, ప్రత్యర్థి యొక్క రాబడిని దృష్టియందుంచుకొని న్యాయస్థానమునకు యుక్తమని తోచు మొత్తమును, అర్జీదారుకు చర్యాకాలములో నెలనెలా చెల్లించవలసినదనియును ప్రత్యర్థికి న్యాయస్థానము ఉత్తర్వు ఈయవచ్చును.

25. (1) ఈ చట్టము క్రింద అధికారతను వినియోగించు ఏ న్యాయస్థానమైనను, డిక్రీని ఇచ్చునప్పుడైనను, తరువాత ఎప్పుడైనను, భార్యగాని, సందర్భానుసారముగ, భర్తగాని అందుకై దరఖాస్తు పెట్టుకొనిన మీదట, ప్రత్యర్థియొక్క సొంతరాబడిని, ఉన్నచో ఏదేని ఇతర ఆస్తిని, దరఖాస్తుదారుని రాబడిని, ఇతర ఆస్తిని పక్షకారుల ప్రవర్తనను, కేసుయొక్క ఇతర పరిస్థితులను దృష్టియందుంచుకొని న్యాయమని న్యాయస్థానమునకు తోచునంత మొత్తమును, ఒకే మొత్తముగానైనను నెలసరిగా, లేదా నియతకాలికముగానైనను, దరఖాస్తుదారు జీవిత పర్యంతమునకు మించని కాలమువరకు, అతని లేక ఆమె పోషణార్థము దరఖాస్తుదారుకు ప్రత్యర్థి చెల్లించవలసినదని ఉత్తరువు ఈయవచ్చును. మరియు అవసరమగుచో అట్టి ఏ చెల్లింపుకైనను ప్రత్యర్థి యొక్క స్థిరాస్తిని ప్రభారమునకు గురిచేయుటద్వారా ప్రతిభూతిని కల్పించవచ్చును. శాశ్వతమనువర్తి మరియు భరణ-పోషణము.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద ఉత్తరువు ఇచ్చిన తరువాత ఎప్పుడైనను, పక్షకారులిరువురిలో ఎవరి పరిస్థితులలోనైనను మార్పు కలిగినదని న్యాయ స్థానమునకు రూఢియైనచో వారిలో ఎవరి అభ్యర్థనపైనైనను, అట్టి ఏదేని ఉత్తరువును న్యాయస్థానము, తాను న్యాయమని భావించు రీతిగా మార్చ వచ్చును, మార్పు చేయవచ్చును లేక రద్దు చేయవచ్చును.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద అనుకూలమైన ఉత్తరువు పొందిన పక్షకారు పునర్వివాహము చేసికొనెనని గాని, భార్య అట్టి పక్షకారు అయి ఉన్నచో ఆమె శీలవతిగా ఉండలేదని గాని, భర్త అట్టి పక్షకారు అయి ఉన్నచో, అతడు తన భార్య కానట్టి ఎవరేని స్త్రీతో సంభోగించినాడని గాని, న్యాయస్థానమునకు రూఢియైనచో, ఎదిరి పక్షకారుని అభ్యర్థనపై, అట్టి ఏదేని ఉత్తరువును న్యాయస్థానము, తాను న్యాయమని భావించు రీతిగా మార్చవచ్చును, మార్పు చేయవచ్చును, లేక రద్దు చేయవచ్చును.

26. ఈ చట్టము క్రింది ఏచర్యలోనైనను, మైనరు బిడ్డల అభిరక్ష, పోషణము మరియు చదువును గురించి, వీలైనంత మేరకు వారి ఇచ్ఛకు అనుగుణముగ, న్యాయస్థానము తాను న్యాయమని, సముచితమని భావించునట్టి మధ్యకాలిక ఉత్తరువులను ఈయవచ్చును; వాటిని గురించి నిబంధనలను డిక్రీలో చేర్చవచ్చును, మరియు అందుకై అర్జీద్వారా దరఖాస్తు పెట్టుకొనబడిన మీదట, డిక్రీ ఇచ్చిన తరువాత అట్టి డిక్రీని పొందుటకు తేబడిన చర్య ఇంకను జరుగుచున్న యెడల ఆ బిడ్డల అభిరక్ష, పోషణము మరియు చదువును గురించి మధ్యకాలిక ఉత్తరువుల ద్వారాగాని డిక్రీద్వారా గాని చేయదగియుండెడి అన్ని ఉత్తరువులను, నిబంధనలను, ఆయా సమయములందు న్యాయస్థానము చేయవచ్చును; అట్లు చేసిన ఉత్తరువులను, నిబంధనలను ప్రతిసంహరించవచ్చును, నిలుపుదల చేయవచ్చును, లేక మార్చవచ్చును. బిడ్డల అభిరక్ష.

27. ఈ చట్టము క్రింది ఏ చర్యలోనైనను, వివాహ సమయమున లేక తత్సమీప కాలములో కానుకగా ఈయబడి భార్యాభర్తలిరువురకు ఉమ్మడిగా చెందియుండు ఏదేని ఆస్తిని గూర్చి న్యాయస్థానము తాను న్యాయమని, సముచితమని భావించు నిబంధనలను డిక్రీలో చేర్చవచ్చును. ఆస్తిని గురించి పరిష్కారము.

28. (1) ఈ చట్టము క్రింది ఏ చర్యలోనైనను న్యాయస్థానము చేసెడి డిక్రీలన్నియు ఉపపరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలకు లోబడి, ఆ న్యాయస్థానము తన ఆరంభిక సివిలు అధికారితను వినియోగించుచు చేసిన డిక్రీలవలె అపీలు చేయదగినవై యుండును; అట్టి అపీలు ప్రతిదియు, ఆ న్యాయస్థానము తన ఆరంభిక సివిలు అధికారితను వినియోగించుచు ఇచ్చిన నిర్ణయములపై సాధారణముగా అపీలు చేయదగియుండెడు న్యాయస్థానమునకు చేయదగియుండును. డిక్రీలపైనను, ఉత్తరువులపైనను అపీళ్లు.

(2) ఈ చట్టము క్రింది ఏ చర్యలోనైనను న్యాయస్థానముచే 25వ పరిచ్ఛేదము, లేక 26వ పరిచ్ఛేదము క్రింద చేయబడెడు ఉత్తరువులు, అవి మధ్యకాలిక ఉత్తరువులుకానిచో, ఉపపరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలకు లోబడి, అపీలు చేయదగినవై యుండును, అట్టి అపీలు ప్రతిదియు, ఆ న్యాయస్థానము తనఆరంభిక సివిలు అధికారితను వినియోగించుచు ఇచ్చిన నిర్ణయములపై సాధారణముగా అపీలు చేయదగియుండెడు న్యాయస్థానమునకు చేయదగి యుండును.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద కేవలము ఖర్చుల విషయమున ఎట్టి ఆపీలు ఉండదు.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద ప్రతి అపీలును, డిక్రీలేక ఉత్తరువు తేదినుండి ముప్పది దినములలోపల పెట్టుకొనవలెను.

డిక్రీలను, ఉత్తరువులను అమలుపరచుట.

28-ఏ. ఈ చట్టము క్రింది ఏ చర్యలోనైనను న్యాయస్థానముచే ఈయబడిన అన్ని డిక్రీలను, ఉత్తరువులను, ఆరంభిక సివిలు అధికారితను వినియోగించుచు ఆ న్యాయస్థానము ఇచ్చిన డిక్రీలను, ఉత్తరువులను తత్సమయమున ఏ రీతిగా అమలు పరచెదరో, ఆరీతిగనే అమలుపరచవలెను.

## వ్యావృత్తులు మరియు రద్దులు

వ్యావృత్తులు.

29. (1) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము హిందువులమధ్య జరుపబడి అన్యథా చెల్లెడు వివాహమును, వధూవరులు ఒకే గోత్రమునకు,లేక ప్రవరకు చెందియుండిరను, లేక వేరు వేరు మతములకు, కులములకు, లేక ఒకే కులములోని వేరువేరు ఉపశాఖలకు చెందియుండిరను కారణమాత్రముననే,చెల్లనిదనిగాని,ఎప్పుడైనను చెల్లుబడి లేనిదై యుండెడిదని గాని భావించరాదు.

(2) ఈ చట్టములోనిదేదియు, ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వముగాని తరువాత గాని జరుపబడిన హిందూ వివాహము విచ్ఛేదము చేయబడుటకు ఆచారముద్వారా గుర్తింపబడిన, లేక ఏదేని ప్రత్యేక అనుశాసనముద్వారా ఒసగబడి ఏ హక్కుకైనను భంగము కలిగించునదిగా భావింపబడరాదు.

(3) ఏదేని వివాహమును ప్రభావశూన్యము అయినట్టిదని ప్రఖ్యానించుటకు, లేక ఏదేని వివాహమును రద్దు లేక విచ్ఛేదము చేయుటకు లేక న్యాయిక వేర్పాటు చేయుటకు, తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము క్రింద ఈ చట్టము ప్రారంభమయిపుడు జరుగుచున్న ఏదేని చర్యకు, ఈచట్టములోనిదేదియు భంగము కలిగించదు మరియు ఏదేని అట్టి చర్యను ఈ చట్టము చేయబడకుండినఎట్లో, అట్లే కొనసాగించి పరిష్కారము చేయవచ్చును.

1954 లోని 43వ చట్టము.

(4) ఈ చట్టములోనిదేదియు, ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వముగాని తరువాతగాని ప్రత్యేక వివాహ చట్టము, 1954 క్రింద హిందువుల మధ్య జరుపబడిన వివాహములకు సంబంధించి ఆ చట్టములోగల నిబంధనలకు భంగము కలిగించునదిగా భావింపబడరాదు.

రద్దులు.

30. రద్దు మరియు సవరణ చట్టము, (1960 లోని 58వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదము, మరియు ప్రథమ అనుసూచి ద్వారా రద్దు చేయబడినది.